సాక్షి
ఒడిశా

సోమవారం । 8 । జూలై । 2024



రథం ఊడ్చి శుద్ధి చేస్తున్న పూరి గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్



బలభద్ర స్వామి రథం తాళ ధ్వజం లాగుతున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జయహో జగన్నాథ



జన సంద్రంలో జగన్నాథుని రథం నందిఘోష్

దేవదేవుడు గర్భగుడి వదిలి బయటకు వచ్చాడు. కోవెల పరిసరాలను పావనం చేస్తూ రథాన్ని అధిరోహించాడు. కదలి ఘోషతో పోటీ పడుతూ సాగిన భక్తుల జయజయధ్వానాల నడుమ సుభద్ర, బలభద్ర సమేతుడై గుండిచాకు బయల్దేరాడు. గుండె గొంతుగా చేసుకుని జనం జయహో జగన్నాథ అని కీర్తిస్తుంటే.. చిరుమందహాసుడై ఆలకించాడు. ప్రేమగా రథాన్ని లాగుతుంటే అంత గొప్పదేవుడు అవలీలగా ముందుకు కదిలాడు. నేత్రోత్సవం, నవ యవ్వన సేవతో అలసినా.. భక్తుల కోసం రెండు అడుగుల దూరం కదిలి మిగిలిన దూరం మరునాటికి వెళ్దామంటూ సందేశమిచ్చాడు.



నందిఘోష్ రథంపై జగన్నాథున్ని నమస్కరిస్తున్న విపక్ష నేత నవీన్ పట్నాయక్

- శంఖ ధ్వనితో మారుమోగిన పూరీ క్షేత్రం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- తొలి విడత రథయాత్ర విజయవంతం
- నేడు మలి విడత ఉత్సవం

భువనేశ్వర్:

భక్తుల మధ్య సాక్షాత్తు భగవంతుడు ప్రత్యక్షమయ్యే జగన్నాథుని రథయాత్ర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పంచాంగ గణాంకాల ప్రకారం ఈ ఏడాది యాత్ర వరుసగా 2 రోజులు నిర్వహించాల్సి వచ్చింది. దీంతో వేర్వేరుగా జరగాల్సిన నేత్రోత్సవం, నవ యవ్వన ఉత్సవం రథయాత్ర నాడే నిర్వహించాల్సి వచ్చింది. రథాలు తొలి రోజున శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణ నుంచి బయల్దేరాయి. మర్నాడు గుండిచా మందిరం ఆవరణకు చేరుతాయి. ఈ మధ్యలో మూల విరాట్ల దైనంది సేవాదులు రథం పైనే యథాతథంగా నిర్వహిస్తారు. భక్తులకు రాత్రింబవళ్లు మూల విరాట్‌ల దర్శనం సులభంగా లభిస్తుంది. యాత్ర ఆచారం ప్రకారం శ్రీ మందిరం లోపలి సేవాదులు పూర్తి చేసి ఆలయం బయట రథ ప్రతిష్ఠ, పొహండి, ఛెరా పొంహరా వంటి కార్యక్రమాలు ముగించి రథాల్ని లాగడం ప్రారంభించారు. రథాలపై మూల విరాటులు ఆసీనులు కావడంతో పూరి గజపతి మహారాజా రథాలు ఊడ్చి శుద్ధి చేశారు.

హాజరైన రాష్ట్రపతి, రాష్ట్ర ప్రముఖులు..

జగన్నాథుని రథయాత్రలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆమెతో పాటు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, విపక్ష నేత నవీన్ పట్నాయక్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పలువురు మంత్రులు, శాసన సభ్యులు, ప్రముఖులు యాత్రలో పాల్గొన్నారు.



రథాలపై ఉన్న మూల విరాటుల ముందు మోకరిల్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



రథయాత్ర సందర్భంగా ఒడిశా రివ్యూ, ఉత్కళ ప్రసంగ్ సంచికల్ని ఆవిష్కరించిన ప్రముఖులు

సంప్రదాయబద్ధంగా..

బలభద్ర భగవానుని తాళ ధ్వజం కదలడంతో మిగిలిన రెండు రథాలు లాగడం ప్రారంభించారు. సంప్రదాయం ప్రకారం రథాలపై దేవుళ్లకు సేవాదులు ముగించారు. అనంతరం రథాలకు అమర్చిన తాత్కాలిక మెట్లు తొలగించి రథ సారథులు, గుర్రాల్ని అమర్చి రథాలు లాగేందుకు సిద్ధం చేశారు. జగన్నాథుడు, అతని తోబుట్టువుల మనోహరమైన యాత్రను చూసేందుకు 3 కిలోమీటర్ల పొడవైన 'గ్రాండ్ రోడ్' వద్ద ఆబాల గోపాలం స్వామిభక్తులుగా సమ భావంతో పాలుపంచుకుని రథాల్ని లాగి తొలి రోజు రథయాత్రని విజయవంతం చేశారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులేనని ఈ యాత్రలో ప్రత్యక్షంగా సాక్షాత్కారమైంది. రాష్ట్రపతి వంటి ప్రముఖులు సైతం సాధారణ భక్త జనం తరహాలో స్వామి రథం లాగి తరించారు.

తొలి రోజు 2 గంటల యాత్ర

శ్రీ మందిరం నుంచి గుండిచా మందిరానికి తొలి రోజు రథయాత్ర స్వల్పంగా 2 గంటలతోనే ముగిసింది. సాయంత్రం 4.50 గంటలకు కదిలిన రథాలు 6.45 గంటలతో మార్గ మధ్యంలో ఆగాయి. చివరగా బయల్దేరిన జగన్నాథుని నందిఘోష్ రథం నామమాత్రంగా 2 అడుగులు మాత్రమే కదిలింది. మొదట బయల్దేరిన బలభద్ర భగవానుని తాళ ధ్వజం మారీచికోట్ వీధికి చేరి ఆగింది. దేవీ సుభద్ర రథం రాజనగరి ఆవరణ వరకు వెళ్లి నిలిచింది. సూర్యాస్తమయం కావడంతో ఎక్కడి రథాలు అక్కడ నిలిపి మిగిలిన యాత్రని మర్నాటికి పొడిగించారు.



రాజ నగరి పరిసరాల్లో ఆగిన దేవీ సుభద్ర రథం



మార్గ మధ్యలో ఆగిన బలభద్ర స్వామి తాళ ధ్వజం

రథయాత్రలో అపశృతి

భువనేశ్వర్: పూరి జగన్నాథుని రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రథాలు లాగుతున్న పరిస్థితిలో ఊపిరాడక ఓ భక్తుడు మృతి చెందాడు. ఆచారం ప్రకారం తొలుత బలభద్ర స్వామి తాళ ధ్వజం కదలడంతో ఒక్కసారిగా వేలాది మంది రథం లాగేందుకు తరలివచ్చారు. ఈ రద్దీలో చిక్కుకున్న భక్తుడు జనం ఒత్తిడిని తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. పోలీసులు వలంటీర్ల సహాయంతో తక్షణమే జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వ్యక్తి చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

వేడుకగా పొహండి

భువనేశ్వర్: స్వామి రాక కోసం నిరీక్షణ ముగిసింది. జ్యేష్ఠ పూర్ణిమ నుంచి కనుమరుగైన జగన్నాథుడు సోదరిసోదర సమేతంగా భక్త జనం మధ్యకు ప్రత్యక్షంగా తరలివచ్చాడు. ఈ సందర్భంగా పొహండి (ఆగుతు ఆగుతూ తరలి రావడం) కార్యక్రమం సంప్రదాయబద్ధంగా సాగింది. శ్రీమందిరం రత్న వేదికపై కొలువు దీరిన చతుర్ధా మూర్తులు యాత్ర కోసం క్రమ పద్ధతిలో తరలివచ్చారు. ఈ ప్రక్రియని ధాడి, గొట్టి పొహండిగా పేర్కొంటారు. తొలుత రక్షకుడైన సుదర్శనుడు తరలిరాగా, దేవీ సుభద్రకు రక్షకునిగా ఆమె రథం దర్ప దళనంపై ఆసీనుడయ్యాడు. వెంబడి అన్న బలభద్ర స్వామి తరలి రావడంతో దేవీ సుభద్ర అన్న అడుగు జాడల్లో తన రథం దర్ప దళనం అధిష్టిస్తుంది. చివరగా జగన్నాథుడు మురిపిస్తు మురిపిస్తూ తీరికగా సింహ ద్వారం దాటి బయటకు రావడం విశేషం. ఈ ప్రక్రియకు ఎటువంటి భంగం వాటిల్లకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూల విరాటు వెనుకకు చెక్క అమర్చి తల, నడుముకు మందపాటి పట్టు తాడులతో పట్టు కోల్పోకుండా బిగించారు. ఈ తంతుని సేనా పొట్టాగా వ్యవహరిస్తారు.



రథంపైకి తరలివెళ్తున్న బలభద్ర స్వామి



యాత్ర కోసం తరలి వస్తున్న దేవీ సుభద్ర



పుష్ప మకుటధారి నల్లనయ్య పొహండి

నాట్య మండపం గుండా ...

శ్రీ మందిరం జయ విజయ ద్వారం ఆవరణ నుంచి నాట్య మండపం గుండా జగన్నాథుడు యాత్ర కోసం 7 మెట్ల గడప దాటి వచ్చాడు. ఈ ప్రాంగణంలో మూల విరాట్లకు భారీ పుష్ప కిరీటాల్ని అమర్చారు. పుష్ప కిరీటాల్ని టహ్యాగా పేర్కొంటారు. స్థానిక రాఘవ్ దాస్ మఠం యాత్ర కోసం టహ్యాలు సిద్ధం చేసి అందజేస్తుంది.

అద్భుతం..శ్రీక్షేత్రం



కాంతులీనుతున్న శ్రీక్షేత్రం

భువనేశ్వర్: జగన్నాథుని రథోత్సవంతో శ్రీక్షేత్రం ప్రత్యేక శోభతో కాంతులీనుతోంది. రేయింబవళ్లు భగవంతుని సమక్షంలో భక్తులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. కనులారా దర్శించి మనసారా ప్రార్థించుకోవడంతో తన్మయం పొందుతున్నారు.

విహంగ నిరీక్షణ



రథాల ముంగిట పక్షులు

భువనేశ్వర్: జగన్నాథుని ఆగమనం కోసం ఆకాశ వీధిలో విహంగాల నిరీక్షణ దృశ్యం ప్రత్యేకంగా నిలిచింది. సృష్టిలో ప్రతి జీవరాశికి జగన్నాథుని రథయాత్ర ప్రత్యేకమే. సర్వులకు సమాన దర్శన భాగ్యం కల్పించే జగన్నాథుడు ఇలా అందరివాడిగా ప్రత్యక్షమయ్యాడు.

ఆజ్ఞామాల సమర్పణ



కలశం, నీలచక్రంతో ఆజ్ఞామాల సమర్పణ

భువనేశ్వర్: మూలవిరాట్ నుంచి ఆజ్ఞకు సంకేతం పూలమాల. స్వామి సంబంధిత కార్యకలాపాల్లో ఆజ్ఞా మాల పొందడం స్వామి సమ్మతికి సూచన. రథయాత్ర సందర్భంగా స్వామి ఆజ్ఞా మాల అందడంతో జగన్నాథుని రథం శిఖరాన కలశం, నీలచక్రానికి పూజలు నిర్వహించారు. దీంతో యాత్రకు రథం పూర్తిగా సిద్ధమైనట్లు పరిగణించారు.

రథయాత్రకు మేముసైతం..



బుల్లిరథంతో చిన్నారులు

భువనేశ్వర్: స్వామి యాత్ర ఆబాలగోపాలాన్ని తన్మయంలో ముంచెత్తుతోంది. చిన్నారులు సైతం తమ వంతుగా స్వహస్తాలతో బుల్లి రథం తయారు చేసి యాత్ర నిర్వహించిన దృశ్యం జట్నీ బల్లిఛక్ సాహి వీధుల్లో ఆదివారం ప్రత్యేకంగా కనిపించింది

జగన్నాథ రథంపై పార్శ్వ దేవతలు

జగన్నాథుని నందిఘోష రథంపై తొమ్మిది మంది పార్శ్వ దేవతలు దర్శనమిచ్చారు. వీటిని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

-భువనేశ్వర్



పంచముఖి హనుమంతుడు



హరిహర



మధుసూదన




గిరిగోవర్ధన ధారి




పాండు నృసింహ



చింతామణి కృష్ణ



నారాయణుడు



రావణ ఛత్రభంగ



రాముడు, హనుమంతుడు


పర్లాకిమిడి: చెరాపహారా నిర్వహిస్తున్న యువరాణి కల్యాణీ దేవి గజపతి


పర్లాకిమిడి: పహాండి నిర్వహిస్తున్న భక్తులు


రాయగడ: రథం వద్ద ఎంపీ సప్తగిరి దంపతులు, ఎమ్మెల్యే కద్రక


రాయగడ:రాయగడలో భక్తుల సందడి


రాయగడ:గుణుపూర్‌లో జగన్నాథుడు


రాయగడ:చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


జయపురం:సుభద్రను తీసుకొస్తున్న సేవాయత్తులు


కొరాపుట్: రథం లాగుతున్న భక్తులు


జయపురం:జగన్నాథునికి పూజలు చేసిన సబ్ కలెక్టర్


పర్లాకిమిడి: జగన్నాథ రథాల వద్ద ఒడిస్సీ నృత్యం


కొరాపుట్: జగన్నాథుడికి పాహండి

జనం చెంతకు జగన్నాథుడు

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా రథయాత్ర
- దేవతామూర్తులను దర్శించుకున్న భక్తజనం
- హాజరైన ప్రముఖులు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో గుండిచా రథయాత్రలో భాగంగా బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామిని పహాండి జరిపి రథాలపై ఎక్కించారు. గజపతి వంశీయురాలు, యువరాణి కళ్యాణీ గజపతి రథాలపై బంగారు చీపురుతో తుడిచి చెరాపహారా నిర్వహించారు. అనంతరం పూజలు చేశారు. కాసేపు వర్షం పడటంతో భక్తులంతా శుభసూచకంగా భావించారు. 54 ఏళ్ల తరువాత రథయాత్రకు తగులు మిగులు పడటంతో రథాలను గుండిచా మందిరం వరకూ లాగి అక్కడే ఉంచి సోమవారం గుండిచాకు తరలిస్తామని సేవాయత్‌లు తెలిపారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, సెంచూరియన్ వర్శిటీ ఉపాధ్యక్షులు డి.ఎన్.రావు, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: జిల్లాలో రథయాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాయగడలోని జగన్నాథ మందిరం నుంచి గుండియా మందిరానికి సాయంత్రం నాలుగున్నర గంటలకు రథాన్ని తీసుకువెళ్లారు. వేలాది మంది భక్తజనంతో పాటు కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక దంపతులు, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక జగన్నాథ బలభద్ర, సుభద్ర దేవతామూర్తులను దర్శించుకున్నారు. గుణుపూర్‌లోనూ రథయాత్ర ఘనంగా జరిగింది. సబ్ కలెక్టర్ కిరణ్ మయి కౌర్ రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు.


పర్లాకిమిడి: రాజవీధిలో రథాల పహాండి వద్ద భక్తజనం

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో దాపు 53 ఏళ్ల తర్వాత రెండు రథయాత్రలు జరుగుతున్నాయి. వాస్తవానికి అనారోగ్యం పాలైన జగన్నాధుడు కోలుకున్న తర్వాత నేత్రోత్సవం నాడు భక్తులకు దర్శనమిస్తాడు. ఆ మరునాడు రథయాత్ర జరుగుతుంది. పంచాంగాల ప్రకారం ఈ ఏడాది నేత్రోత్సవం, రథయాత్ర ప్రారంభం ఒకే రోజు పడింది. దాంతో ఆదివారం నేత్రోత్సవం జరిపిన వెంటనే బహుడా నిర్వహించారు. అందులో భాగంగా జగన్నాథ, సుభద్ర,బలబద్ర విగ్రహాలను రథంపై ఉంచి బహుడా ముగించారు. అనంతరం రథాన్ని కొద్ది అడుగులు మాత్రమే ముందుకు నడిపి నిలిపివేశారు. కేవలం కొరాపుట్ పట్టణంలో మాత్రమే మూడు రథాలు సాయంత్రం నాటికి గుండిచా మందిరానికి చేరుకున్నాయి. నబరంగ్‌పూర్, ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కొటియా తదితర ప్రాంతాలలో మిగతా రథయాత్ర సోమవారం జరగనుంది. ఉమ్మర్‌కోట్ రథయాత్రలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో, నబరంగ్‌పూర్‌లో ఎమ్మెల్యే గౌరి శంకర్ మజ్జి , కొరాపుట్ రథయాత్రలో జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహీనిపతి, బ్రహ్మపుర బీజేడి నాయకుడు బ్రుగు భక్షిపాత్రో, మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెరి పాల్గొన్నారు.


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో రథయాత్రకు సిద్ధమైన దేవదేవుళ్లు

జయపురంలో..

జయపురం: జయపురంలో రథయాత్ర ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. సాయంత్రం జగన్నాథ్ మందిరం నుంచి దేవతామూర్తులను వెలుపలకు తీసుకొచ్చి రథొపాడియాలో అందంగా అలంకరించిన రథాలలో అధిష్ఠించారు. దేవతామూర్తులన తోడ్కొని వచ్చే మార్గంలో భక్తులు వివిధ భోగాలను స్వామివారికి సమర్పించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రథొపాడియ నుంచి రథాలను గుండిచ మందిరానికి తీసుకెళ్తారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పొరిడ, తదితర అధికారులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: జిల్లాలో రథయాత్ర ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం నిర్వహించిన జగన్నాథ యాత్రలో కలెక్టర్ సచిన్ పవార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుండిచా మందిరం వరకు రథయాత్ర కొనసాగింది.


పర్లాకిమిడి: బలభద్రున్ని రథంపై ఎక్కిస్తున్న సేవాయత్‌లు


రాయగడ: రథంపై కొలువుదీరిన దేవతామూర్తులు


కొరాపుట్: ఉమ్మర్ కోట్ రథయాత్రలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గొండో


మల్కన్‌గిరి: రథంపై జగన్నాథుని దేవతామూర్తులు


కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలో రథయాత్ర


జయపురం:సునారి వీధి కూడలి వద్ద వేచి ఉన్న భక్తులు


కొరాపుట్: సబర శ్రీక్షేత్ర జగన్నాథుడికి సబరలు తీసుకొచ్చిన అటవీ ఫలాలు


కొరాపుట్ : దురువా జాతి గిరిజనుల ఊరేగింపు


మల్కన్‌గిరి: రథం వద్ద ఊడ్చుతున్న కలెక్టర్ సచిన్‌పవార్


కొరాపుట్: కొటియాలో రథయాత్ర


జయపురం:రథపాడియ వీక్షిస్తున్న అధికారులు, భక్తులు


రాయగడ: విద్యుత్ అలంకరణలో రాయగడ జగన్నాథ మందిరం

ఘనంగా అనాథాశ్రమ వార్షికోత్సవం

పర్లాకిమిడి: స్థానిక డోలాట్యాంకు రోడ్డులో నవజీవన్ అంధ అనాథశ్రమం 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర కె.శ్రీధర్, రథయాత్ర కూడా ఇదే రోజు కావడంతో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిషాలోని బలంఘీర్, ఆంధ్రలోని విశాఖపట్నం జిల్లా పాడేరులో 15వ బ్రాంచ్ తెరుస్తున్నామని చెప్పారు. అనంతరం 77 మంది వృద్ధ మహిళలకు అన్నలక్ష్మీ పథకం కింద పేదలకు నెలకు సరిపడా రేషన్, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది భాగ్యలక్ష్మీ నాయక్, జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ సంఘం అధ్యక్షుడు, పారిశ్రామిక వేత్త వైశ్యరాజు బాలాజీరాజు, ఆధ్యాత్మిక వేత్త విశాలాక్షి అయ్యంగర్, కేంద్ర అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు బినోద్ జెన్నా, న్యాయవాది గణేష్ పటా్నయిక్, నవజీవన్ ట్రస్టు ఇన్‌చార్జి ఎస్.వి.రమణ, మేనేజర్ ప్రభాసినీ కుమారి లిమ్మా పాల్గొన్నారు.


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న శ్రీధర్ ఆచార్య

ఓడినా ప్రజలతోనే..

కొరాపుట్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన నబరంగ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని కుటుంబం మళ్లీ ప్రజాసేవలో నిమగ్నమైంది. సదాశివ, అతని సతీమణి కౌసల్య ప్రదాని దంపతులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పొలంలో పనుల్లో నిమగ్నమైన గిరిజనుల వద్దకు వెళ్లి వర్షాల నుంచి రక్షణకు ఉపయోగపడే ప్లాస్టిక్ వస్త్రాలు(రెయిన్ కోట్) పంపిణీ చేస్తున్నారు.


రెయిన్ కోట్ అందజేస్తున్న సదాశివ ప్రధాని దంపతులు

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

జయపురం: స్థానిక విక్రమ ఆర్ట్, క్రాఫ్ట్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన దారు దేవత (జగన్నాథుడు) చిత్రకళా వర్క్‌షాపును జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. కళాశాల అధికారులు, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వయంగా జగన్నాథుని చిత్రాలను గీశారు. అనంతరం కళాశాల వ్యవస్థాపకులు మహారాజు విక్రమదేవ్ వర్మ, ప్రసిద్ధ చిత్రకారుడు సింహాద్రి మహరాణల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, కొరాపుట్ జిల్లా సంస్కృతి అధికారి ప్రీతిసుధ జెనా, ప్రిన్సిపాల్ యుధిష్టర్ మల్లిక్ పాల్గొన్నారు.


జగన్నాథుని చిత్రాన్ని గీస్తున్న ఎమ్మెల్యే


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

జయపురం: జయపురం సోషల్ ఎడ్యుకేషన్, ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్(సీవా) ప్రతినిధులు ఆదివారం రథయాత్ర సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జ్యోతిమిల్లు నుంచి గగణాపూర్ మీదుగా సొలప గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా 2 వేలకు పైగా మొక్కలు నాటేందుకు నిర్ణయించుకున్నామని సీవా ప్రతినిధి కృష్ణచంద్రదాస్, ప్రదీప్ కుమార్ సాహు తెలిపారు. జయపురం అటవీ విభాగ రేంజర్ సచ్చిదానంద పొరిడ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు.


మొక్కలు నాడుతున్న సీవా సభ్యులు

ప్రత్యేక ఆకర్షణగా స్టీమ్ ఇంజిన్

పర్లాకిమిడి: బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నడిచిన పి.ఎల్.ఐ.ట్రైన్ ఇంజిను పర్లాకిమిడిలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం సందర్శనకు ఉంచారు. విషయం తెలుసుకున్న స్థానికులు రైల్వేస్టేషన్‌కు విచ్చేసి పాత స్టీం ఇంజిన్ వద్ద సెల్ఫీలు దిగుతున్నారు.



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆవరణలో స్టీం ఇంజిన్

క్లుప్తంగా

ఎత్తుకు పై ఎత్తులు..

- ఉత్సాహభరితంగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: ది విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని ఉడాకాలనీ బంగారమ్మ గుడి దగ్గరలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తలపడ్డారు. వివిధ వయస్సుల విభాగాల వారీగా నిర్వహించిన పోటీల్లో 112 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఒకరికి మించి మరొకరు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ తలపడ్డారు. పోటీలను కమిటీ సభ్యులు ఎస్. బంగారుబాబు, ఈపు విజయ్ కుమార్, సన్నీ మాస్టర్, సముద్రాల గురుప్రసాద్, ఎస్‌వీఎస్ రామకృష్ణ, ఆర్‌వీ తిరుపతిరావు ప్రారంభించారు. అనతంరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా రవికుమార్ వ్యవహరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం కూడలి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్. భూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, మెంటాడ మండలం కుంటినవలస నుంచి ఇసుకను మరడాం తరలిస్తున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకుని మరడాం కూడలి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● కబళించిన మలేరియా



రిష్మిత (ఫైల్)

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న బిడ్డిక రిష్మిత(8) మలేరియాతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందింది. అదే హాస్టల్‌లో మరో నలుగురు మలేరియాతో బాధ పడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మన్యం జిల్లా సీతంపేట మండలం అచ్చబ గ్రామానికి చెందిన రిష్మిత ఇటీవల పాఠశాల తరగతులకు హాజరైంది. ఆ సమయంలో రిష్మితతోపాటు, సవర ప్రభావతికి కూడా తీవ్ర జ్వరం రావడంతో సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి సమాచారం అందించారు. వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారి సంతోష్‌కుమార్ బాలికలను రిమ్స్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రిష్మిత మృతి చెందింది. దీంతో ఆదివారం విద్యార్థినులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందులో సవర స్వప్న, కొండగొర్రి రిబిక, సవర అంజలిలకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. ఒక్కసారిగా మలేరియా ప్రబలడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు



హరీష్ మృతదేహం

గంట్యాడ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గంట్యాడకు చెందిన డి. హరీష్ (25) మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి గంట్యాడ నుంచి కొర్లాం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కొర్లాం నుంచి మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై గంట్యాడ వైపు వస్తున్నారు. సరిగ్గా కొర్లాం టోల్‌గేట్ దాటిన తర్వాత మామిడి తోట వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో హరీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.

‘చదవడం మాకిష్టం’

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో లైబ్రేరియన్ మధుసూదన్‌రావు పలు పుస్తకాలు చదివించారు. అర్థం చేసుకుంటూ పుస్తకాలు ఏ విధంగా చదవాలి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్యారంబోర్డు పోటీలు చేపట్టారు.

రాజన్న.. ప్రజా హృదయ విజేత

- డాక్టర్ వైఎస్సార్ జయంతి నేడు
- తన పాలనలో విప్లవాత్మక మార్పులు
- ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్య సేవలు
- 108 అంబులెన్స్‌లతో ఎంతోమందికి పునర్జన్మ
- 104 ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు



ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్యమిత్రలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పతకం క్రింద చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: తీవ్రమైన కరువుతో రైతులు తీవ్ర ఇబ్బంది పడిన రోజులవి. పంటలు పండక, పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిడుతున్న తరుణమది. పేదోడికి క్యాన్సర్, గుండె జబ్బు వస్తే వైద్యం చేయించుకోవడానికి అస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిందే. ఇవన్నీ 2004 సంవత్సరానికి ముందుండే పరిస్థితులు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. నేడు భౌతికంగా మనమధ్య లేక పోయినప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. 2004 సంవత్సరానికి ముందు పేదోడికి జబ్బు వస్తే చాలు ప్రాణాల మీద ఆశ వదులుకునే వారు. కొంతమంది ఉన్న ఇంటిని, పొలాన్ని అమ్ముకుని వైద్యం చేయించుకునేవారు. వైద్యం చేయించుకోలేని స్థోమత లేనివారు మంచంపైనే మగ్గిపోయి తనువు చాలించేవారు. ఇటువంటి దయనీయ పరిస్థితులను తన పాదయాత్రలో చూసి చలించిపోయిన దివంగత నేత వైఎస్ రాజశేఖరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం కింద తెలుపు రేషన్‌కార్డు కలిగిన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రి అయినా, కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఉచితంగా చికిత్స అందించేవారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.. కార్పొరేట్ ఆస్పత్రి వైపు ఎప్పుడూ కన్నెత్తి చూడని వ్యక్తి కూడా దర్జాగా అదే ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని ఇంటిముఖం పట్టిన సంఘటనలెన్నో ఉన్నాయి. జిల్లాలో 2007 ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించి ఆరోగ్య ప్రదాతగా పేరుగాంచారు రాజన్న. అలాగే 108 అంబులెన్స్‌ల ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇళ్ల వద్దే 104 సిబ్బంది చేత వైద్య సేవలు అందించిన ఘనత రాజన్నకే దక్కుతుంది.

ఆరోగ్యశ్రీ వల్లే ప్రాణాలతో ఉన్నాను..



నా పేరు సియ్యాద్రి సూర్యనారాయణ. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. కొద్ది నెలల కిందట దగ్గు, ఆయాసం వస్తే విజయనగరంలో ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లాను. వైద్యులు గుండెకు ఈసీజీ, యాంజియోగ్రామ్ చేసి ఆపరేషన్ చేయాలన్నారు. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఈ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు ఆదుకుంది. పైసా లేకుండా ఆపరేషన్ చేశారు. కేవలం ఆరోగ్యశ్రీ పథకం వల్లే నేను ఈ రోజు ప్రాణాలతో ఉన్నాను.

2019 నుంచి 2023 ఫిబ్రవరి నెలఖారు నాటికి అందించిన ఆరోగ్యశ్రీ సేవలు వివరాలు		
సంవత్సరం	చికిత్స పొందిన వారు	ఖర్చు చేసిన మొత్తం
2019-20	23,596	రూ.55.43 కోట్లు
2020-21	26,996	రూ.63.75కోట్లు
2021-22	47,297	రూ.93.39కోట్లు
2022-23	42,478	రూ. 71.478 కోట్లు
మొత్తం	1,40,367	రూ.284.04 కోట్లు

ఆరోగ్య ఆసరా కింద లబ్ధిపొందిన రోగుల వివరాలు		
సంవత్సరం	లబ్ధి పొందినవారు	వెచ్చించిన నిధులు
2020-21	16,010	రూ.9.51 లక్షలు
2021-22	33,034	రూ.15.85లక్షలు
2022-23	30,036	రూ 15.28 లక్షలు

ఆరోగ్యశ్రీలో సమూల మార్పులు చేసిన జగనన్న..

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత (2019 నుంచి 2023 వరకు) డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. వ్యాధుల సంఖ్యను పెంచడంతో పాటు చికిత్స అనంతరం కూడా రోగులకు భృతి ఇవ్వడంతో అధికశాతం మంది ఆరోగ్యశ్రీ వైద్య సేవలను వినియోగించుకున్నారు. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే చాలు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేశారు. ఈ పథకం ద్వారా 3,257 వ్యాధులకు చికిత్స అందించారు. 2014-19 టీడీపీ హయాంలో కేవలం 1038 రకాల వ్యాధులకు మాత్రమే చికిత్స అందించేవారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం భృతిని చెల్లించారు. రోజుకి రూ.225 చొప్పున నెలకు 5 వేల రూపాయల వరకు చెల్లిస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య



రూప్‌చంద్ (ఫైల్)



హేమసంధ్య మృతదేహం

భోగాపురం: వివిధ కారణాలతో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల్లో భాగంగా ఎల్అండ్‌టీ సంస్థలో వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రూప్‌చంద్ (28) అనేవ్యక్తి రెడ్డికంచేరు పంచాయతీ దిబ్బలపాలెం సమీపంలో ఉన్న జీడితోటలో ఉరి వేసుకుని చనిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి శనివారం రాత్రి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రూప్‌చంద్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్అండ్‌టీ సంస్థలో డ్రైవర్‌గా చేరాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరావాల్సి ఉంది. మృతుడి తమ్ముడు శ్యామ్‌లాల్ ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు...

విజయనగరం క్రైమ్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయనగరం పట్టణంలోని కణపాకలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు తెలియజేసిన వివరాల మేరకు... కణపాక తారకరామ కాలనీలో నివాసం ఉంటున్న నక్కా శ్రీనివాస్ (33) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జె.తారకేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కొత్తవలస మండలం సీతంపేటకు చెందిన ఎన్. హేమసంధ్య (19) ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సుదర్శన్, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఉరి పోసుకుని యువతి..

కొత్తవలస : మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఎస్.హేమసంధ్య (19) ఆదివారం ఉరిపోసుకుని మృతి చెందింది. ఎస్సై సుదర్శన్, స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. హేమసంధ్య పాలిటెక్నకల్ కోర్సు పూర్తి చేసి బీటెక్‌లో జాయిన్ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లగా.. ఒంటిలో నలతగా ఉందని చెప్పి హేమసంధ్య ఇంటిలో ఉండిపోయింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి పక్కనే గల లక్ష్మిని గంజి ఇవ్వాలని హేమసంధ్య అడిగింది. అయితే వంట ఇంకా పూర్తవ్వలేదు, అయిన తర్వాత ఇస్తానని లక్ష్మి చెప్పింది. కొద్దిసేపటి తర్వాత లక్ష్మి గంజి పట్టుకుని సంధ్య ఇంటికి వెళ్లి తలుపుకొట్టగా స్పందించలేదు. దీంతో కిటికీలోనుంచి చూడగా శ్లాబ్ హుక్‌కు హేమసంధ్య ఉరి పోసుకుని కనిపించింది. వెంటనే లక్ష్మి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా చైర్మన్‌గా ఇందుకూరి రఘురాజు, అధ్యక్షుడిగా డాక్టర్ కేఏ నాయుడు, గౌరవ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, చీఫ్ ప్యాట్రన్‌గా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, అడ్వైజర్‌గా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నున్న సురేష్, కోశాధికారిగా కేవీ రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ వీఎస్ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ రఘురాజు, అధ్యక్షుడు కేఏ నాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీబీఏ ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావు, ఎస్.సూరిబాబు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి వి.వెంకటరమణ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.జయకృష్ణ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం.సురేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం : పట్టణంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులందరూ వ్యక్తిగత, సామాజిక సమస్యలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు నాణ్యమైన ఆహారం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్ : వసతిగృహ చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని సాయినగర్ కాలనీలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన వంటలను రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. వసతిగృహాల బయట అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలించి అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల స్టడీ అవర్ల నిర్వహణ, తరగతుల బోధన విషయాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు..

వసతిగృహాలను తనిఖీ చేస్తున్న సమయంలో డిప్యూటీ వార్డెన్ చిరంజీవినాయక్ అందుబాటులో లేకపోవడంతో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గిరిజన సంక్షేమ అధికారి ఎం. రుక్మాందరావును ఆదేశించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్ ప్రిన్సిపాల్ బీవీ ప్రసాద్ పట్నాయక్, చిన్న మోహన్, రాయుడు, ఆయాలు, వసతి గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ సస్పెన్షన్

పార్వతీపురం టౌన్: సమగ్ర శిక్షా కార్యాలయం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జి. గోవింద మద్యం సేవించి కార్యాలయానికి వస్తుండడం, తోటి సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. భూర్జవలస గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు ఎస్. భూర్జవలస ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. కొద్ది రోజులుగా గ్రామంలోనే తిరుగుతున్నాడని, ఆదివారం ఉదయం నిద్రలోనే చనిపోయాడని తెలిపారు. శవ పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. వివరాలు తెలిసిన వారు 91211 09461 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న పిల్లల అసిరయ్య



విషజ్వరంతో మంచం పట్టిన లొడగల జగదీష్

తెర్లాం: మండలంలోని పూనువలస పంచాయతీ పరిధి కాలంరాజుపేటలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటివరకు గ్రామానికి చెందిన సుమారు 40మందికి పైగా జ్వరాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం గ్రామానికి చెందిన పలువురు జ్వరపీడితులు రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరాలతో చికిత్స పొందుతున్న వారిలో లండ జానకి, జగదీష్, లొడగల రమణమ్మ, అలబోయిన అప్పమ్మ, బొడ్డాన లక్ష్మి, ఏలిశ భవాని, దేవి తదితరులు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన పిల్లల అప్పమ్మకు జ్వరం రావడంతో, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొంది ఇంటికి వచ్చేసింది. శనివారం ఆమెకు మళ్లీ ఆయాసం రావడంతో కుటుంబసభ్యులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్సకు తీసుకువెళ్లగా శ్రీకాకుళం తీసుకువెళ్లమని రిఫర్ చేశారని కుటుంబసభ్యులు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఉదయం శ్రీకాకుళం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుమారులు తెలిపారు. మృతురాలి భర్త అసిరయ్య కూడా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆయనకు కూడా ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో జ్వరాలు వచ్చిన విషయం తెలుసుకున్న పెరుమాళి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరాలపై అవగాహన కల్పించడంతోపాటు, వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ రమణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మధు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గ్రామంలో వైద్యసేవలు

కాలంరాజు పేటలో విజృంభిస్తున్న విషజ్వరాలపై పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌ను వివరణ కోరగా, గ్రామంలో జ్వరాలు సోకినప్పటి నుంచి వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వేడినీరు తాగమని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అవగాహన కల్పించామని చెప్పారు.

పైనాపిల్ ధర పతనం



పైనాపిల్‌ను మార్కెట్‌కు తరలిస్తున్న మహిళలు



వ్యాపారులు కొనుగోలు చేసిన పైనాపిల్

సీతంపేట: పైనాపిల్ ధరలు పతనమయ్యాయి. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మార్కెట్‌కు పైనాపిల్ పండ్లు భారీగా వచ్చాయి. దిగుబడి ఎక్కువ కావడంతో గిరిజనులు అధిక సంఖ్యలో పండ్లు తీసుకురావడంతో డిమాండ్ తగ్గి ధర పడిపోయింది. చిన్నసైజ్ పండు రూ. 8, పెద్ద పండు అయితే 15 రూపాయల చొప్పున గిరిజనులు దళారులకు విక్రయించారు. సీజన్ ఆరంభంలో రూ.18 నుంచి 23 రూపాయల వరకు పలికిన పైనాపిల్ ధర ఒక్కసారిగా పడిపోవడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. గిరిజనులు కొండకోనల్లో సేకరించిన పైనాపిల్ పండ్లను కావిళ్లతో మోసుకు వచ్చి విక్రయించినప్పటికీ శ్రమకు తగ్గ ఫలితం లభించడం లేదని వాపోతున్నారు. ఇంకా ధరలు మరింత పతనమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉంటే గిరిజనుల నుంచి అతి తక్కువ ధరకు పైనాపిల్ పండ్లను కొనుగోలు చేస్తున్న దళారీలు ఆటోలు, వ్యాన్‌లతో పట్టణాలకు తరలించి, అక్కడ ఒక్కో పండు 30 రూపాయల చొప్పున విక్రయిస్తుండడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో రూ.50 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. పండ్లను నిల్వ ఉంచి ధరలు వచ్చినప్పుడు విక్రయిద్దామన్నా కోల్డ్ స్టోరేజీ వంటి సదుపాయాలు లేకపోవడంతో దళారీలు అడిగిన ధరకు విక్రయించాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు.

పట్టించుకోని వెలుగు, హార్టికల్చర్ అధికారులు..

దళారీల చేతుల్లో గిరిజన రైతులు మోసపోతున్నా హార్టికల్చర్, వెలుగు శాఖాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రెండేళ్ల కిందట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆ రెండు శాఖల అధికారులు గిరిజనులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అధికారులే లారీలు, వ్యాన్‌లు సమకూర్చి రాష్ట్రంలోని 13 జిల్లాల రైతుబజార్లలో పండ్లు విక్రయించడంతో గిరిజనులు నాలుగు డబ్బులు కళ్లజూశారు. అప్పట్లో ఒక్కో పండు సరాసరి రూ.20 వరకు విక్రయించారు. ఇప్పుడు అటువంటి చర్యలు లేకపోవడంతో దళారీ వ్యాపారులు సిండికేట్‌గా మారి గిరిజనులను మోసగిస్తున్నారు.

వ్యాపారులకు విక్రయిస్తున్నాం..



కుశిమి, ముత్యాలు, శంబాం, తొత్తడి, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా పైనాపిల్ పండుతుంది. సీజన్ ఆరంభమై 20 రోజులు గడిచిపోయింది. మొదట్లో ఉన్న ధరలు ఇప్పుడు లేవు. రెండేళ్ల కిందట ఐటీడీఏ ద్వారా విక్రయించే వాళ్లం. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. వ్యాపారులు అడిగిన రేటుకు వారికే విక్రయిస్తున్నాం.

ఎస్.రమేష్, ముత్యాలు గ్రామం

రైతులను ఆదుకోవాలి..



పైనాపిల్ రైతులను ఆదుకోవాలి. మొదట్లో గిట్టుబాటు ధరలు బాగానే ఉంటాయి. సీజన్ ఆఖరుకు వచ్చేసరికి ధరలు పడిపోవడం పరిపాటిగా మారింది. మాకు ఇదే ప్రధాన ఆదాయ వనరు కాబట్టి ప్రభుత్వపరంగా ఆదుకోవాలి.

ఎస్.సిమ్మయ్య, సర్పంచ్, దారబ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, డీఏఓ ఉమామహేశ్వరావు

విజయనగరం ఫోర్ట్:

వ్యవసాయశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు విజయనగరంలోని కర్షకరత్న ఆగ్రో కెమికల్స్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాల నిల్వ పట్టికలు, భౌతిక విలువల పట్టికలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలు చేసిన నివేదికల ను ఉన్నతాధికారులకు అందించినట్లు వ్యవసా య అధికారి ఎం.ఉమామహేశ్వరావు తెలిపా రు. రూ.3.94 లక్షల విలువ చేసే ఎరువులకు సంబంధించి సమగ్ర నివేదిక తయారు చేసి నమూనాలు తనిఖీకి పంపించినట్లు చెప్పారు.

రామనారాయణంలో ‘కల్కి’ బుజ్జిగాడు



కల్కి కారుకు పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ‘కల్కి’ సినిమాలో ప్రధాన భూమిక పోషించిన బుజ్జిగాడు వాహ నం ఆదివారం సందడి చేసింది. ఇటీవల విడుదలై హిట్ టాక్ సంపాదించిన పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన లేటెస్ట్ తెలుగు సిని మా ‘కల్కి 2989’లో ప్రభాస్ ఉపయోగించిన భారీ వాహనాన్ని ప్రచార కార్యక్రమంలో భా గంగా రామనారాయణం ప్రాంగణానికి ఆది వారం తీసుకువచ్చారు. ముందుగా రామనారాయణం ప్రాంగణానికి చేరుకున్న వాహనా నికి ఆలయ అర్చకులు చాణక్య, జీజే హర్షలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ కారు ఎక్కి డ్రైవ్ చేశారు. కారు ఇన్‌చార్జ్ రమేష్, ఆలయ మేనేజ ర్లు శ్రీనివాస రాజు, ఎంపీ రమణ పాల్గొన్నారు.